
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## ఆంధ్రప్రదేశ్‌కు నూతన రైల్వే ప్రాజెక్టులు కేటాయించారా?



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వివరించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు లోక్‌సభలో బుధవారం వివిధ అంశాలపై ఆయన ప్రశ్నలు వేశారు. రాష్ట్రంలో ప్రతిపాదించిన, నిర్మాణంలో ఉన్న రైల్వే ప్రాజెక్టుల వివరాలు, ప్రస్తుతం వాటి స్థితి తెలియ జేయాలన్నారు. అలాగే నూతనంగా కేటాయించబ డిన, మంజూరు చేయబడిన, వినియోగించబడిన మొత్తం నిధుల వివరాలు ఆరా తీశారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వద్ద ప్రణాళికలు ఉన్నాయా అని వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ సమాధానమిచ్చారు. రైల్వే ప్రాజెక్టుల కేటాయింపు రాష్ట్రాలు, జిల్లాలవారీగా ఉండదని, రైల్వే జోన్ల వారీగా ఉంటుందన్నారు. రైల్వే ప్రాజెక్టులు చేపట్టడం అనేది దాని వ్యయం, కనెక్టివిటి, ప్రత్యామ్నాయ మార్గాలు, రద్దీ, మార్గాల పెంపుదల, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, పార్లమెంటు సభ్యుడు, ఇతర ప్రజాప్రతినిధులు లేవనెత్తిన డిమాండ్లు, రైల్వే సొంత కార్యాచరణ అవసరాలు, సామాజికఆర్థిక పరిస్థితులు వంటి వాటిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దక్షిణ రైల్వే, దక్షిణ మధ్య రైల్వే, నైరుతి రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ల పరిధిలోకి వస్తుందన్నారు. రైల్వే జోన్ల వారీగా ప్రాజెక్టుల వివరాలు, వాటి ఖర్చు భారతీయ రైల్వే వెబ్సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఈ జోన్ల పరిధిలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 01.04.2024 నాటికి, మొత్తం 5,329 కి.మీ పొడవును కవర్ చేస్తూ, 73,743 కోట్ల విలువైన 41 రైల్వే ప్రాజెక్టులు(17 కొత్త లైన్లు, 24 డబ్లింగ్) ప్రణాళిక/ఆమోదం/అమలు దశలో ఉన్నాయన్నారు. వీటిల్లో 1006 కి.మీల పొడవున 24,150 కోట్ల విలువైన పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. అలాగే 6764 కి.మీ గల 65 సర్వేలు(13 కొత్త లైన్, 52 డబ్లింగ్) గత మూడు సంవత్సరాలలో అంటే 2021 – 22, 2022 -23, 2023 – 24, ప్రస్తుత సంవత్సరం 202425లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించినట్లు చెప్పారు. 2014 నుంచి భారతీయ రైల్వేలకు నిధుల కేటాయింపులో గణనీయమైన పెరుగుదల ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2009 – 2014 మధ్య రైల్వేలకు సంవత్సరానికి రూ.886 కోట్లు కేటాయిస్తే.. 2025 – 26 సంవత్సరానికే ఆంధ్రప్రదేశ్‌కు రూ.9417 కోట్ల విలువైన ప్రాజెక్టుకు కేటాయించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ, అటవీ క్లియరెన్స్, అనుమతులు, భౌగోళిక పరిస్థితులు, ప్రాజెక్ట్/స్థలం ప్రాంతంలో శాంతిభద్రతల పరిస్థితి, పని సమయం, నిర్దిష్ట ప్రాజెక్ట్ కోసం పనిచేసే సమయం వంటి అంశాలు ఇక రైల్వే ప్రాజెక్టుల పూర్తి అనేది ఆధారపడి ఉంటుందన్నారు. వివిధ రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు జోనల్ రైల్వేలు, ఇండియన్ రైల్వే సామాజిక మాధ్యమాల్లో ఉంచబడుతుందన్నారు.

## ఇండియన్ నేవీ అగ్నివీర్ రిక్రూట్‌కు దరఖాస్తులు



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త** ఇండియన్ నేవీ అగ్నివీర్ సీనియర్ సెకండరీ రిక్రూట్ (ఎస్ ఎస్ ఆర్) కోసం ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో కోరారు. ఇండియన్ నేవీ అగ్ని వీర్ ప్రవేశాల కోసం ఇంటర్మీడియట్ విద్యార్హత గల పురుషులతో పాటు మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు దశల్లో నిర్వహించే పరీక్షలు, ఫిజికల్, మెడికల్ టెస్ట్‌లతో నియామకాలు ఉంటాయి. ఇలా అవకాశం వచ్చినవారు శిక్షణతో కలిపి నాలుగేళ్ల సేవలు అందించవచ్చు. అనంతరం వీరిలో 25 శాతం శాశ్వత ఉద్యోగులుగా తీసుకుంటారు. మిగిలినవారికి ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తారు. ఎస్ఎస్ఆర్ అర్హత ఈ పోస్టులకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్/ ప్లస్2లో మ్యాథ్స్, ఫిజిక్స్ తప్పనిసరి సబ్జెక్టులుగా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు అర్హులు. లేదా మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఆటోమొబైల్స్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వీటిలో ఎందులోనైనా 50 శాతం మార్కులతో మూడేళ్ల డిప్లొమా లేదా మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో రెండేళ్ల ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసుకున్నవారు అర్హులు. ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసినవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. స్టేజ్ 1 (ఐనెట్), స్టేజ్ 2 రెండు దశల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. వయసు: సెప్టెంబరు 1, 2004 డిసెంబరు 31, 2008 మధ్య జన్మించిన అవివాహితులు అర్హులు. ఆన్లైన్ దరఖాస్తు ఏప్రిల్ 10 సాయంత్రం 5గంటల వరకు చేసుకోవాలన్నారు. జీఎస్టితో కలిపి రూ.649,మేనెలలో ఆన్‌లైన్‌లో స్టేజ్1దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈఅవకాశాన్ని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాలోనిఆసక్తిగల అభ్యర్థులందరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు.

## పరిపాలన సౌలభ్యం కోసం సూపరింటెండెంట్ ల బదిలీలు

### -కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిపాలన సౌలభ్యం కోసం, వివిధ విభాగాల పనితీరును క్రమబద్ధీకరించడానికి పలువురు సూపరింటెండెంట్ లను బదిలీలను చేపట్టినట్టు కమిషనర్ సూర్య తేజ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. వి. పద్మావతి సూపరింటెండెంట్ ను ఇంజనీరింగ్ సెక్షన్ నుంచి ఎలక్షన్ విభాగానికి, ఎ.వి. సులోచన సూపరింటెండెంట్ ను పబ్లిక్ హెల్త్ విభాగం, ఇంచార్జ్ సూపరింటెండెంట్ మెప్మా నుంచి రెవెన్యూ విభాగానికి బదిలీ చేశారు. కె. పద్మ సూపరింటెండెంట్ ను టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి హౌసింగ్ విభాగానికి, మునిరత్నం సీనియర్ అసిస్టెంట్ ను జి ఎస్ డబ్ల్యూ ఎస్ విభాగం నుంచి ఇంచార్జ్ సూపరింటెండెంట్ టౌన్ ప్లానింగ్ విభాగానికి మార్చారు.అలాగే పి.శ్రీనివాసులు సూపరింటెండెంట్ ను రెవెన్యూ విభాగం నుంచి పబ్లిక్ హెల్త్ విభాగానికి/ఇంచార్జ్ సూపరింటెండెంట్ గా మెప్మా విభాగానికి, బి. విజయ సీనియర్ అసిస్టెంట్ ను ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ విభాగం నుంచి ఇంచార్జ్ సూపరింటెండెంట్ జి ఎస్ డబ్ల్యూ ఎస్ విభాగానికి,ఎన్. నరేంద్ర సూపరింటెండెంట్ ను కమాండ్ కంట్రోల్ విభాగం నుంచి ఇంజనీరింగ్ విభాగానికి, జి. బాల సుబ్రహ్మణ్యం సీనియర్ అసిస్టెంట్ ను హౌసింగ్ విభాగం నుంచి మెప్మా విభాగం సీనియర్ అసిస్టెంట్ గా బదిలీలు చేస్తూ కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు.

## వార్తా కథనానికి స్పందించిన జడ్పీ సీఈఓ



**తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త** శిథిలావస్థకు చేరినా.. పాత బిల్డింగ్ పడగొట్టరా అనే వార్తా కథనానికి స్పందించి బుధవారం జడ్పీ సీఈఓ విద్యాధరి శిథిలావస్థకు చేరిన పాత బిల్డింగ్‌ను పరిశీలిచేందుకు వచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. గత 70 సంవత్సరాలు క్రితం తోటపల్లిగూడూరు మండలంలోని మహాలక్ష్మీపురంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో ఒక స్కూల్ బిల్డింగ్ నిర్మించారు. ఆ బిల్డింగ్‌ను పరిశీలించిన జడ్పీ సీఈఓ విద్యాధరి ఆ బిల్డింగ్ నలు దిక్కులు క్షుణ్ణంగా పరిశీలించి ఆమె వెంట ఉన్న సమగ్ర శిక్షన ఏఈ బలరాములు, పీఆర్ ఏఈ రమేష్‌బాబును పిలిచి ఆ బిల్డింగ్‌పై ఎస్టిమేసన్ తయారు చేయాలని సమగ్ర శిక్షణ ఏఈను ఆదేశించారు. అలాగే పంచాయతీ రాజ్ ఏఈ తొందరగా తయారు చేసిన ఎస్టిమేషన్‌ను పరిశీలించి ఆ బిల్డింగ్ పడగొట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. వాస్తవానికి ఈ బిల్డింగ్ ఇంత శిథిలావస్థలో ఉంటే ఎందుకు దీనిపై చర్యలు తీసుకోలేదని సంబందిత అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా ఫలితంగా ఆ బిల్డింగ్‌పై ఫార్మాలిటీ అన్ని పూర్తి చేసి పడగొట్టి శిథిలాలను వెంటనే అక్కడి నుంచి తొలగించే విధంగా చర్యలు తీసుకుని పిల్లలు ఇటు వైపు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని బిల్డింగ్ పనులు త్వరగా మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ -2 జయరామ నాయుడు, హైస్కూల్ హెడ్‌మాస్టర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఏప్రిల్ 2, ప్రభాతవార్త** : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 53.160 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 300, పెన్నా డెల్టాకు 330, కండలేరు వరద కాలువకు100 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 96.875మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## నేలటూరు ఫిషింగ్ జెట్టీ నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేయిస్తాం

- మరో జెట్టీ నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ముత్తుకూరు పంచాయతీని దత్తత తీసుకున్న అదానీ కృష్ణపట్నం పోర్టు కంపెనీకి ధన్యవాదాలు
- రూ.1.30 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆరోగ్య కేంద్రాలకు పరికరాలు అందిస్తున్న ఎస్ఈఐఎల్ కంపెనీకి అభినందనలు - ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**ముత్తుకూరు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త** ఆదాని కృష్ణపట్నం పోర్టు, ఎస్ఈఐఎల్ కంపెనీలు తమ సీఎస్ఆర్ నిధుల్లో 80 శాతం సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల కోసమే ఖర్చుపెట్టాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ముత్తుకూరు మండలం నేలటూరు పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ జెట్టీని అదానీ కృష్ణపట్నం పోర్టు ప్రతినిధులతో కలిసి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణపట్నం రేవు ద్వారా గతంలో ఈ ప్రాంత మత్స్యకారులు చేపల వేట సాగించేవారన్నారు. ఓ వైపు పోర్టు, మరోవైపు థర్మల్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుతో మత్స్యకారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అదానీ కృష్ణపట్నం పోర్టు కంపెనీ ఇచ్చిన హామీ మేరకు రూ.17 కోట్లతో ఫిషింగ్ జెట్టీ నిర్మాణం చేపట్టారు. ఏపీ మారిటైం బోర్డుతో చేసుకున్న ఒప్పందం మేరకు 300 మీటర్ల బ్రేక్ వాటర్ సామర్థ్యంతో 180 మీటర్ల పొడవైన జెట్టీ నిర్మాణం జరుగుతోందన్నారు. జెట్టీ నిర్మాణం పూర్తికావడానికి మరో రూ.15 కోట్లు అవసరమవుతుంది. దానిని ఏపీ మారిటైం బోర్డు భరిస్తుందని తెలిపారు.మరో 10 రోజుల్లో ఆర్ అండ్ బీ, ఓడరేవుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యతో పాటు ఉన్నతాధికారులందరినీ ఇక్కడికి తీసుకొస్తానన్నారు. ఎన్నికల ముందు నుంచి ఆగిపోయిన జెట్టీ నిర్మాణ పనులను పూర్తి చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాను అన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న జెట్టీ ఒక్క నేలటూరు పంచాయతీ మత్స్యకారులకు మాత్రమే ఉపయోగపడుతుందని, మిగిలిన గ్రామాల వారి కోసం ఎదురుగా మరో జెట్టీ నిర్మించాలనే డిమాండ్ వచ్చింది. చిల్లకూరు, వాకాడు, ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండలాల మత్స్యకారులతో పాటు కొడవలూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన మత్స్యకారులకు ఉపయోగపడేలా మరో జెట్టీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. వేలాది కుటుంబాలు తమకు తాతముత్తాలు ఇచ్చిన భూములు, ఆస్తులను ప్రాజెక్టుల నిర్మాణం కోసం అప్పగించి నిర్వాసితులయ్యారు. భూములను కోల్పోవడమే గాక కాలుష్యం బారిన పడుతున్నారు. నేలటూరు పునవాస కాలనీల నిర్మాణాలు గత ఐదేళ్లలో నిలిచిపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ పనులు మొదలుపెట్టామన్నారు. అదానీ కృష్ణపట్నం పోర్టు, శీనివాలి కంపెనీ, ఏపీ జెన్ కోలు ఈ ప్రాంతానికి వచ్చాయని సంతోషించాలో, ఈ ప్రాంత ప్రజలు కష్టాలు పడుతున్నారని బాధపడాలో తెలియని పరిస్థితిలో ఉన్నామని, 18 వేల మంది జనాభా కలిగిన ముత్తుకూరు మేజర్ పంచాయతీని దత్తత తీసుకున్న అదానీ కృష్ణపట్నం పోర్టు కంపెనీకి అభినందనలు తెలిపారు. అలాగే అదానీ మంచి మనస్సుతో పోర్టులో కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించాలని కోరుతున్నామన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, రొయ్యలు, చేపలతో పాటు ఇతర ఉత్పత్తులు, పరికరాల ఎగుమతులు, దిగుమతులకు పోర్టు ద్వారా అవకాశం కల్పించాలని విన్నవిస్తున్నా మని, ఎస్ఈఐఎల్ కంపెనీ సర్వేపల్లి నియోజకవర్గం లోని ఆస్పత్రులకు రూ.1.30 కోట్ల సీఎస్ఆర్ నిధులతో వివిధ రకాల పరికరాలు అందజేస్తుండటం ఆనందదాయకరమన్నారు. రెండు మూడు రోజుల్లోనే ఆరోగ్య కేంద్రాలకు ఆ పరికరాలు అప్పగించనున్నారు. ఆయా కంపెనీలు తమ సీఎస్ఆర్ నిధుల్లో 80 శాతాన్ని ఈ ప్రాంత ప్రజల కోసం ఖర్చు చేయాలని విజప్తి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మునుకూరు రవికుమార్ రెడ్డి, ఈదూరు రామ్మోహన్ రెడ్డి, నేలటూరు మాజీ సర్పంచ్ వావిళ్ళ జనార్ధన్, మల్లికార్జున యాదవ్, ముని రెడ్డి, ఈశ్వరయ్య, సురేష్, రాగల శివకృష్ణ, మామిడాల శ్రీనివాసులు, జాతీయ తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు అబ్దుల్ షఫీవుల్లా, అక్కయ్య గారు ఏడుకొండలు, నాగార్జున,దువ్వూరు అనిల్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, కోదండ రామయ్య, శోభన, పైనపురం సర్పంచ్ విజయ్ కుమార్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడ దేవస్థానానికి ఈ ట్రస్టుబోర్డే ఉంటుందా ? కొత్తబోర్డు వస్తుందా?

### కామాక్షితాయి ఆలయం విషయంలో రాజకీయాలు చేస్తు అమ్మవారి ఆగ్రహానికి గురికాక తప్పదు!





**బుచ్చి ఏప్రిల్ 2 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలో పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి కొత్త ట్రస్టుబోర్డు ఎప్పుడు వేస్తారని నాయకులు ఎదురు చూస్తున్నారు. ఈనెల గడిస్తే మే నెల వస్తుంది.మే నెలాఖర్‌లో శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు కూడా రాబోతున్నాయి.

**అయితే వైసిపి హయాంలో వేసిన ప్రస్తుతం ఉన్న ట్రస్టుబోర్డే ఉంటుందా ?**

లేక కొత్త ట్రస్టుబోర్డు వస్తుందా అని నాయకులు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు. సంగం లాంటి దేవస్థానాలకు కొత్తగా ట్రస్టుబోర్డులు కూడా వేశారు. కాని పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడకి ట్రస్టుబోర్డు ఎప్పుడు వేస్తారా అని కొందమంది నాయకులు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న ట్రస్టుబోర్డుకి 2026 ఫిబ్రవరి వరకు సమయం ఉందని తెలుస్తోంది. టిడిపి ప్రభుత్వం వచ్చినప్పటికి వైసిపి ప్రభుత్వం సమయంలో వచ్చిన ఈ ట్రస్టుబోర్డే కొనసాగుతుందని టిడిపినాయకులే ఆసక్తికరంగా చర్చించుకోవడం కొసమెరుపు! అయితే ప్రస్తుతం ఉన్న ట్రస్టు బోర్డు ఏకార్యక్రమాలలో చురుకుగా పాల్గోనకుండా వుండడం పట్ల ప్రజలు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు. ఏనాయకులైనా దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తు బాగుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆలయానికి సంబందించిన దాతలు కూడా జొన్నవాడ దేవస్థానం గతంలోనే బాగున్నింది అంటు పెదవి విరుస్తున్నారు. జొన్నవాడ ఆలయం విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని అమ్మవారి ఆగ్రహానికి గురి కావల్సి వస్తుందని అమ్మవారి భక్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## అప్రూవర్‌గా మారినట్లు దుష్ప్రచారం : శ్యాం ప్రసాద్ రెడ్డి

- ఇది ఖచ్చితంగా రాజకీయ కక్ష
- మైనింగ్ అధికారులకే స్పష్టత లేదు
- కేసులకు భయపడేది లేదు
- వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నేటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 2, ప్రభాతవార్త** ఒక ఎలక్ట్రానిక్ ఛానెల్‌లో తాను అప్రూవర్‌గా మారినట్లు దుష్ప్రచారం చేయడం పై వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్నేటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్ఆర్‌సీపీ జిల్లా ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మాజీ మంత్రి, జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అక్రమ మైనింగ్ కేసులో తనను ఏ1గా చేర్చి అప్రూవర్‌గా మారి... ప్రభుత్వానికా... అధికారులకా... ఎవరికి అన్నట్లు అర్థం వచ్చేలా ఆ ఛానెల్‌లో ప్రచారం చేయడం తగదన్నారు. పోలీసులు విచారణ పూర్తి కాలేదని సంబంధిత అధికారులు కోర్టుకు సమాచారం ఇస్తున్న నేపథ్యంలో ఇలా తనమీద బురద జల్లితే ఆ ఛానెల్ రేటింగ్ పెంచుకోవడానికో... ఆఛానెల్ని ముందుకు తీసుకెళ్ళడానికో ఈ విధమైన ప్రచారం చేస్తున్నారని తనకు అనిపిస్తుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి జగనన్నను నమ్మిన సైనికుడిగా కొనసాగుతున్న తనపై ఏదో కేసు పెట్టినంత మాత్రాన అప్రూవర్‌గా మారుతానని అనుకోవడం వారి వెర్రితనమన్నారు. పొదలకూరు మండలం తాడి పత్రి గ్రామానికి చెందిన అక్రమ మైనింగ్‌లో ఫిబ్రవరి 12,14వ తేదీల్లోవాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డిపై ఛార్జ్‌షీట్లు పెట్టి ఫిబ్రవరి 16వ తేదిన తనను నిందితుడిగా చేర్చారన్నారు. దీనిపై సంబంధిత అధికారులు, డీఎస్పీలకు తాను ఇచ్చిన సమాచారంలో ఎవరిపేరునైనా చెప్పి తాను అప్రూవర్‌గా మారినట్లు వారి దగ్గర ఏదైనా సాక్ష్యాలు ఉంటే బయట పెట్టాలన్నారు. ఫిబ్రవరి 16వ తేది తనను నిందితుడిగా చేరిస్తే 19వ తేదిన హైకోర్టును ఆశ్రయించానన్నారు. 24వ తేదిన హైకోర్టు ముందస్తు బెయిల్ ఇస్తూ పోలీసులకు సహకరించాలని కోర్టు సూచించిందన్నారు. అప్పటి నుంచి తనను ఏ అధికారి పిలవడం కానీ, విచారించడం కానీ జరగలేదన్నారు. అలాంటప్పుడు అప్రూవర్‌గా మారారంటా... అదంటా.... ఇదంటా... అంటూ తనపై అబాండాలు వేయడం కుట్రతో కూడిన ఛానెళ్ళ నిర్వాకమేనని ధ్వజమెత్తారు. అప్పటి మైనింగ్ డీడీ శ్రీనివాస్ కుమార్ ప్రస్తుత డీడీ బాలాజీనాయక్‌లకే స్పష్టత లేదన్నారు. పొంతన లేని నోటీసులతో ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులుకి మైనింగ్ డీడీ షోకాజ్ నోటీసులు ఇచ్చి రూ.7.56 కోట్లు ఫెనాల్టీ వేసిన విషయాన్ని గుర్తు చేశారు. తర్వాత ప్రస్తుత మైనింగ్ డీడీ బాలాజీనాయక్ తన పేరును కూడా చేర్చి పోలీసులకు పిర్యాదు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. విద్యాకిరణ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు బనాయించారని అన్నారు. అసలు ఓనరేలేని మైన్స్‌కు అక్రమాలు జరిగాయని కేసు పెట్టడం దారుణమన్నారు. ఓనర్ లేనప్పుడు ఆ భూమి ప్రభుత్వానిదని ప్రభుత్వ భూమిలోని ఖనిజ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులదేనన్నారు. అయితే అధికారులు స్పష్టత లేకుండా వెంట వెంటనే ఫిర్యాదులు మార్చి మార్చి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. మాజీ మంత్రి కాకాణి నియోజకవర్గంలో ఆయన అధికారంలో ఉన్నప్పుడు తామేదో చేశామని బురదజల్లే ప్రయత్నం తప్ప ఇందులో వాస్తవ అవాస్తవాలు ప్రజలందరికి తెలుసన్నారు. అప్రూవర్‌గా మారితే ఏ 1గా తనను ఎందుకు చేరుస్తారని ప్రశ్నించారు. అసత్య ప్రచారాలు మాని మీడియా వారికి సందేహాలు ఉంటే తనను నేరుగా సంప్రదించాలని అన్నారు. వాస్తవాలు తెలుసుకుని వార్తలు ప్రచురించాలని సూచించారు. రాజకీయ పరంగా ఎవరు ఎటుపోతే మనకేమిటే అనుకునే మనస్తత్వం తనది కాదని, విలువలతో కూడిన కుటుంబంలో నుంచి వచ్చానన్నారు. రాజకీయాలు చేసి డబ్బులు సంపాదించాల్సిన అవసరం, ఉద్దేశ్యం తనది కాదన్నారు. ఇటీవల కొందరు రాజకీయ నాయకులు రాజకీయాలు మానేసి వ్యవసాయం చేసుకుంటామని చెప్పుకొస్తున్నారని అన్నారు. కానీ స్వతహాగా తమది వ్యవసాయ కుటుంబమని 250 ఎకరాల్లో ఆర్గానిక్ వ్యవసాయం చేసే క్రమంలో 8 నెలలుగా రాజకీయాలకు దూరంగా ఉన్నానని తెలిపారు. కచ్చితంగా ఈ కేసులో ఏ1గా పెట్టడం రాజకీయమేనని ఊరికే పార్టీలు మారే తత్వం తనది కాదన్నారు. అధికార పార్టీ చేసే కుట్రపూరితమైన రాజకీయాలకు లీగల్‌గానే పోరాడుతామని విలేకరుల అడిగిన ప్రశ్నలకు సమాదానమిచ్చారు.

## రైళ్లను నిలిపివేసి ప్రయాణీకులను దోపిడీ చేసిన దోపిడీ దొంగలు

### కేకలతో భయకంపితులైన ప్రయాణీకులు



**కావలి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త** రైళ్లను నిలిపివేసి దోపిడీ దొంగలు ప్రయాణీకులనుంచి బంగారం, నగదు దోపిడీ చేసిన ఉదంతం తీవ్రసంచలనం సృష్టించింది. ఒక్కసారిగా ప్రయాణీకులు కేకలతో భయకంపితులయ్యారు. ఈ సంఘటనపై రైల్వే డిఎస్పీ మురళీధర్ కావలి ఆర్‌పిఎఫ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కావలి జీఆర్‌పిఎఫ్ స్టేషన్ పరిధిలో అల్లూరురోడ్డు పడుగుపాడు స్టేషన్ల మధ్య మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు గుర్తుతెలియని దుండగులు రైళ్లను నిలిపివేసి నిద్రిస్తున్న ప్రయాణీకులనుంచి బంగారు నగలు, నగదు దోపిడీ చేశారన్నారు. చండీఘడ్ మధురై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ముగ్గురు దుండగులు రైల్లోకి ప్రవేశించి ప్రయాణీకులను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. వారివద్ద ఉన్న బంగారు నగలు, నగదు దోపిడి చేశారన్నారు. మరో ఇద్దరు రైలులోపలే ఉండి ఆ ముగ్గురు దుండగులకు సహకరించినట్లు డిఎస్పీ తెలిపారు. ప్రయాణీకులను బెదిరించి ఇద్దరు మహిళల మెడల్లో 20 సవర్ల బంగారు నగలను దోపిడీ చేశారన్నారు. మరో వ్యక్తివద్ద ఉన్న బ్యాగును బలవంతంగా లాక్కున్నారన్నారు. దుండగులు ముందుగానే కేబుల్‌వైర్లను కట్‌చేసి సిగ్నల్స్‌ను మార్చి రైళ్లను నిలిపివేసినట్లు తెలిపారు. ఈ ఉదంతం రైల్వే చరిత్రలోనే తీవ్ర సంచలనం సృష్టించింది. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా భద్రతను పెంచుతామని, నేరస్తులను త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు.

**20 నిముషాలపాటు ఎక్స్‌ప్రెస్ రైలు :** గ్యాంగ్‌దోపిడీ దుండగులు పడుగుపాడు స్టేషన్‌లో ట్రాక్‌పై సమస్యను సృష్టించి 20 నిముషాలపాటు రైలును నిలిపివేశారు. ఎస్-4, ఎస్-5 కోచుల్లో మహిళల మెడల్లోని బంగారు నగలు దుండగులు దోపిడి చేశారు. కేబుల్ కట్‌చేయడంతో రైలును మళ్లీ పడుగుపాడు స్టేషన్‌లో మరికొందరు ప్రయాణీకులపై దాడిచేసి బంగారు నగలను దోపిడి చేశారు. ఈ సంఘటనతో ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లు 25 నిముషాల పాటు ఆలస్యంగా నడిచాయి. ఎస్-2, ఎస్-3, ఎస్-5 కోచుల్లో బంగారు నగలు దోపిడిచేసి బ్యాగుల్లో ఎత్తుకెళ్లారు. ప్రయాణీకుల నుండి వివరాలు సేకరించడానికి రైలును నెల్లూరు, గూడూరుల్లో నిలపకుండా చెన్నై పెరంబూర్ స్టేషన్‌లో నిలిపివేసి వివరాలు సేకరించారు. నెల్లూరుకు చెందిన ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి బృందాల నిఘా కొరవడడంతో, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రయాణీకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసి శాపనార్థాలు గుప్పించారు. అల్లూరురోడ్డు స్టేషన్‌లోని సి.సి టివి పుటేజ్‌లను పరిశీలిస్తూ విచారణ సాగిస్తున్నట్లు తెలుస్తుంది. రైల్లో ప్రయాణించాలన్నా ప్రయాణీకులు భీతిల్లిపోతున్నారు. రైల్వేశాఖ పరిధిలోని పోలీసులపై ప్రయాణీకుల విశ్వాసం సన్నగిల్లింది.

## నేటి నుండి చేజర్లలలో ఆధార్ ప్రత్యేక క్యాంపు

**చేజర్ల ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలో 15 గ్రామ సచివాలయాలలో గురువారం నుండి జిరో నుండి 6 సంవత్సరాల పిల్లలకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ విజయలలితా ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా 3 వ తేది పాదేరు ,యనమదల,నాగుల వెలటూరు గ్రామ సచివాలయాలలో 8 వ తేది పెరమర్లపాడు, కోటి తీర్ధం, నెర్నూరు, గ్రామ సచివాలయాలలో ప్రత్యేక ఆదార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆదార్ క్యాంపులలో బయోమెట్రిక్, ఆదార్ అప్‌డేట్, పిల్లలకు నూతనంగా ఆదార్ చేయడం జరుగుతుందని ఈ ఆదార్ కార్డుని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

## 5 సంవత్సరాలు నిండిన ప్రతి పిల్లవాడు స్కూల్‌లో ఉండేలా చూడాలి



**చేజర్ల ఏఫ్రిల్ 2 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలో ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి పిల్లవాడ్ని పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని చేజర్ల మండల విద్యాశాఖాధికార్లు జి.శ్రీనివా సులు, డిసి మస్తానయ్య లు ఉపాధ్యాయులు సూచించారు. చేజర్ల మండలంలోని ప్రాధమికోన్నత పాఠ శాలల ఉపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతు రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్ధుల ఎన్‌రోల్ పెంచేందుకు మండలంలోని అందరు ఉపాధ్యాయులు, ఈనెలలో స్పెష్టల్ డ్రైవ్ నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తగిన కృషి చేయాలని కోరారు. పాఠశాల అభివృద్ధి గురించి ఎంఇఒ-2 మస్తానయ్య వివరించారు. సమ్మెట్- 2 పరీక్షలు అకడమిక్ పరమైన అంశాలపై వీరు తగు సూచనలు,
సలహాలకు ఉపాద్యాయులకు అందజేశారు.

## త్వరలో గిరిజనులకు ఆధార్ సెంటర్ ఏర్పాటు : స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, విడవలూరు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** మండలంలోని గిరిజనులకు జనన ధ్రువీకరణ పత్రాలు ఉన్న ఆధార్ కార్డులు పొందక, గిరిజన కుటుంబాలు ప్రభుత్వం నుండి వచ్చే పథకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నారని తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి బుధవారం తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రాలు కలిగిన 100 మందిని గుర్తించాం పూర్తిస్థాయిలో పరిశీలన చేసి అర్హులుగా పొందుపరచి ఐ టి డి కి తెలియజేయడం జరుగుతుంది. త్వరలోనే ఐ టి డి ద్వారా 5 ఆధార్ నమోదు కిట్స్ రావడం తద్వారా గిరిజనులకు ఆధార్ నమోదు చేస్తామ న్నారు. మరికొందరికి జనన ధ్రువీకరణ పత్రాలలో తప్పిదాలు ఉన్నవి వాటిని కూడా సరి చేయడం జరుగుతుంది. జనన ధ్రువీకరణ పత్రాలు పొందుటకు పంచాయతీ కార్యాలయాల్లో నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్లను పొంది తదుపరి ఆధార్ కేంద్రాల్లో ఆధార్ నమోదు చేయించడం తద్వారా ప్రభుత్వ పథకాలు పొందడానికి అర్హులు అవుతారు. ఈ అవకాశాన్ని మండల గిరిజన కుటుంబాలు ఉపయోగించుకోవాలని కోరారు.

## ముఖాముఖి సర్వసభ సమావేశం



**విడవలూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వ సభ సమావేశం మండల అధ్యక్షురాలు ఏకుల శేషమ్మ ఆధ్వర్యంలో నిర్వహి ంచారు. మండలంలో అభివృద్ధి పనులపై అన్ని శాఖల అధికారులు ఎంపీటీసీలు, గ్రామ సర్పం చుల ముందు వెల్లడించారు. ఆర్టీసీ సంబంధించి వీరరెడ్డిపాలెం మీదుగా దండిగుంట వరకు వచ్చే బస్సు సౌకర్యం నిలిపివేయడం జరిగింది. పునర్వతం చేయాలని సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున్, ఎంపీటీసీ భక్తవత్సలయ్య కోరారు. అదే విధంగా అన్నా రెడ్డిపాలెం గ్రామంలో వీధులలో గృహ నిర్మాణాలు నిర్మిస్తున్నారు సంబంధిత రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ కుడుముల మోహన్ సభలో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్ కుమారి, తహసిల్దార్ చంద్రశేఖర్, సూపర్నెంట్ రమణమ్మ,ఈస్టన్ ఛానల్ డిస్ట్రిబ్యూట్ కమిటీ చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి, ఉప ఎంపీపీ ఆవుల శ్రీనివాసులు, పి ఆర్ ఏ ఈ శ్యామ్ సుందర్ రెడ్డి, ఈ ఓ పి ఆర్ డి మస్తాన్ ఖాన్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, ఏవో వెంకట కృష్ణయ్య, వర్క్ ఇన్స్పెక్టర్ రవి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి డా. బిఆర్ అంబేద్కర్ గురుకులంలో ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు

**నెల్లూరు సిటీ, ఏప్రిల్ 2, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న డా. బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2025 - 26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లు ఈ నెల 3వ తేది నుంచి ఆన్‌లైన్ ద్వారా తీసుకోవచ్చు అని ఏపిఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ సమన్వయకర్త పద్మజ తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 13వ తేది ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షకు అవసరమైన బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెను తీసుకురావాలన్నారు. హాల్ టికెట్‌తో పాటు విద్యార్థినుల ఆధార్ కార్డు తీసుకురావాలని, విద్యార్థినులు పరీక్ష సమయంకు ఒక గంట ముందు సంబంధిత పాఠశాలలకు హాజరు కావాలని ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సమన్వయకర్త పద్మజ తెలిపారు.

## డైరక్టర్ నాగరాజుకు అభినందనలు



**వలేటివారిపాలెం ఏప్రిల్ 2, ప్రభాతవార్త :** గుడ్లూరు మండల తెదేపా అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు రాష్ట్రయాదవ కార్పోరేషన్ డైరక్టర్‌గా ఎంపికయ్యారు. గురువారం ఆయన అమ రావతిలో పదవీ బాధ్యతలు చేపడుతున్న సంద ర్భంగా మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, సీనియర్ అడ్వకేట్ ప్రగడ శ్రీనివాసులు,తెదేపా సీనియర్ నేతలు కాకుమాని హర్ష,ప్రగడ నరసింహరావు, పోకూరు నేత గట్టమనేని లక్ష్మినరసింహం తదితరులు ఆయనను ఘనంగ సన్మానించారు.

## నేటి నుంచి ఆధార్ క్యాంపులు



**విడవలూరు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** మండలంలోని పాఠశాల, అంగన్వాడి పిల్లలు ఆధార్ నమోదు కొరకు గురువారం నుండి ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని స్థానిక ఎంపీడీవో నగేష్ కుమారి తెలి పారు. ఆధార్ క్యాంపులు తేదీ 3,4 వావిళ్ళ, విడవ లూ రు, రామతీర్థం, 8, 11 తేదీల్లో నాలుగు రోజులు, 8, 9 న పెద్దపాలెం, గాదెలదిన్నె, 10,11 ఊటుకూరు, అల గాని పాడు గ్రామ సచివాలయాలలో నిర్వహించడం జరుగుతుంది. ఈ క్యాంపులో ఆధార్ నమోదుతో పాటు ఫోన్‌నెంబర్ లింకు,చి రునామా మార్పులు, వేలిముద్రలు అప్డేట్ సేవలను మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## నేడే స్వర్గీయ కె.వి.కోటేశ్వరరావు ప్రధమవర్ధంతి

**వలేటివారిపాలెం ఏప్రిల్ 2, ప్రభాతవార్త :** రా ష్ట్రస్దాయి రంగస్థల గాయకుడు,నటుడు,రజకజాతి ముద్దుబిడ్డ,అభినవ హరిశ్చం ద్రుడు స్వర్గీయ కె.వికోటేశ్వరరావు అలియాస్ మోపాడు కోటేశ్వరరావు ప్రధమ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా పలు సాంఘిక నాటకాలు ప్రదర్శించనున్నట్లు సహచర నటుడు కళాకారుడు వలేటివారిపాలెం మండల కళాకారులు సంఘనేత దేపూరి మాలకొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు.స్వర్గీయ కోటేశ్వరరావు గత ఏడాది ఏప్రిల్ 3న దివంగతులఅయ్యారు. ఈయన ప్రదర్శించిన రంగస్దల నటనా కౌశల్యం,నైపుణ్యంలకు రా ష్ట్రప్రభుత్వం సింహతలాట అను అవార్డుతో సత్కరించి ఉన్నారు. ప్రజల మనస్సుల్లో గొప్పకళాకారుడుగా సుస్దిరస్దానం సంపాయించారు.ఈ నేపద్యంలో ఆయన గత స్మృ తులను,కళలను స్మరించుకుంటూ కందుకూరు అంకమ్మదేవాలయం వద్ద గురువారం సాయంకాలం 7గం॥ కందుకూరు పట్టణ కళాకారులచే ఉచితంగా సత్యహరిశ్చంద్ర పూర్తినాటకంను,గయోపాఖ్యానం యుద్దసీనును ప్రదర్శిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కళాభిమానులు,కళాపోషకులు జయప్రదం చేయాల్సి ఒదిగా మాలకొండయ్య,మంచకలపాటి శ్రీనివాసులు తెలిపారు.

## ఇంటిపన్ను, ఖాళీస్థలాలపన్నుకింద 9కోట్ల 41లక్షల వసూళ్లు
## కావలి మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్



**కావలి, ఏప్రిల్02 ప్రభాతవార్త :** 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను కావలి మున్సిపాలిటి పరిధిలో ఇంటిపన్ను, ఖాళీస్థలాల పన్నుల రూపంలో 9కోట్ల 41లక్షల రూపాయలు మున్సిపాలిటికి వసూలైందని కావలి మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్ బుధవారం తెలిపారు. అంతేకాకుండా గత ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరానికి 158 లక్షల రూపాయలు అధికంగా వసూలుచేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అపరాధరుసుముపై 50శాతం రిబేట్ ప్రకటించిన నేపధ్యంలో 2025 మార్చి 26వ తేదీ నుంచి 31 తేదీవరకు 6 రోజుల వ్యవధిలో 1కోటి 26 లక్షలు వసూలు చేయడం జరిగిందని కమీ షనర్ తెలిపారు. హెచ్చుస్థాయిలో పన్ను వసూలు చేయడంలో కృషి చేసిన రెవిన్యూ అధికారి పి.ఫణికుమార్, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్లు షేక్.షరీఫ్, యన్.సురేంద్ర, వార్డు పరి పాలనా కార్యదర్శులు, పన్నువసూళ్లలో పాల్గొన్న ఇతర వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా ఆస్తిపన్ను చెల్లించిన కావలి పట్టణ ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియచేశారు.

## పట్టణంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ సంచులు వాడుతున్నారు
## జనవిజ్ఞానవేదిక నేతలు




**కావలి, ఏప్రిల్02 ప్రభాతవార్త :** కావలి పట్టణంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ సంచులను వాడుతున్నారని, కావలి పట్టణ రైతుబజార్ సెంటర్‌లో ప్రజలకు పర్యావరణ పరిరక్షణ అవగాహన కల్పిస్తూ గుడ్డల సంచులను పంపిణి చేయడం జరుగుతుందని జనవిజ్ఞానవేదిక గౌరవ అద్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, అద్యక్షులు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. కావలి పట్టణంలోని రవి నర్సింగ్‌హోమ్‌లో జనవిజ్ఞానవేదిక అద్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అద్యక్షతన బుధవారం విస్తృతి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 5వ తేది బాబు జగ్జీవన్‌రావు జయంతిని పురస్కరించుకుని రైతుబజార్ సెంటర్‌లో గుడ్డసంచుల పంపిణి కార్యక్రమం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ప్రతి సంవత్సరంలాగానే ర్యాంకర్స్ డే ను జరిపేందుకు భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. జనవిజ్ఞానవేదిక ఆశయాలను ముందుకు తీసుకెళ్లేవారికి తమ మద్దతు ఎల్లవేళలా ఉంటుందన్నారు. ప్రజలు శాస్త్రీయ ఆలోచన ధృక్పధంతో మెలగాలని, మూఢనమ్మకాలను పారద్రోలాలని సమాజాభివృద్ధివైపు పయనించేలా అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెవివి కార్యదర్శి గాదిరెడ్డి హరనాధ్, కోశాధికారి టి.సుబ్బరామశర్మ, జిల్లా ఉపాద్యక్షులు కె.హరినారపరెడ్డి, సి.కల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యురాలు జి.కళ్యాణి, మాధవ, సహాయకార్యదర్శులు గాదిరెడ్డి మురళికృష్ణ, గుణకల శివయ్య, కార్యవర్గ సభ్యులు ఎంవియన్ ప్రసాద్, కె.జాన్, పివియన్ సుధాకర్‌రావు, ఎస్‌కె.రఫి, బి.మాధవరావు, వై.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన యాప్‌పై మరింత అవగాహన పెంచుకోవాలి



**కోవూరు, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతనంగా ప్రవేశపెట్టిన బాల సంజీవని యాప్ 2.0పై ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని సీడీపీవో జ్యోతి అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం నూతనంగా ప్రవేశపెడుతున్న యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రూపొందించిన ఈ బాల సంజీవని యాప్ అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేసేందుకు చాలా సులువుగా ఉండేలా రూపొందించారన్నారు. ఈ యాప్‌లో ఆఫ్‌లైన్‌లో కూడా డేటా ఎంట్రీ చేసుకుని చివరగా ఇంటర్నెట్ సదుపాయం ఉన్న చోట సింక్ చేసుకునే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకునిచ ఈ యాప్‌పై ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, ప్రసన్నలక్ష్మి, తదితరులు ఉన్నారు.

## కండలేరులో48.399 టీయంసీల నిటిమట్టం



**కండలేరుడ్యాం(రాపూరు),ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జళాశయంలో బుదవారం ఉదయం 6 గంటలకు 48.399 టీయంసీల నిటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జళశయంనుండి అవుట్‌ఫ్లోగా హెడ్ రెగ్యులేటర్ నుండి 1340 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, క్యూసెక్కుల చోప్పున మొత్తం 1390 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఎఇ తిరుమలయ్య తెలిపారు.

## కాకాణి.. నువ్వెక్కడా
### - ఎన్ని రోజులు దాక్కుంటావ్
### - పరారవ్వడం మీకు అలవాటే కదా



**నెల్లూరు, ఏప్రిల్ 2, ప్రభాతవార్త-వైద్యం :** వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పే మాటలకు, చేసే పనులకు ఎప్పుడు పొంతన ఉండదని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పైకి శ్రీరంగనీతులు చెబుతాడని, కాకాణి చేసేటివన్నీ పాపాలేనని చెప్పాడు. పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీ వరదాపురం రుస్తుం మైన్ వేదికగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన పాపాలు ఆయనను శాపాలై వెంటాడుతున్నాయన్నారు. అరెస్టులకు అదిరేది లేదు. కేసులకు బెదిరేది లేదని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న ఆయన వారం రోజులుగా కనిపించకుండా పోయాడని ఎద్దేవ చేశారు. ఇప్పటికే మూడు సార్లు నోటీసులు అందించేందుకు పోలీసులు వెళ్తే పత్తా లేకుండా పరారయ్యాడని ఆరోపించారు. హైదరాబాద్‌లో శుభకార్యం ఉందని ఫొటోలతో జిమ్మిక్కులు చేశాడు. బుధవారం పోలీసులు వెళ్తే మాత్రం ఫంక్షన్‌లో లేడని వివరించాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆఫంక్షన్ ఛాయలకే రాలేదు, కుటుంబ సభ్యులను ఆరా తీస్తే లాయర్ పిలిస్తే వెళ్లారని సమాధానం ఇస్తున్నారు. తప్పులు మీద తప్పులు చేయడమెందుకు అంత భయపడుతూ బతకడమెందుకు అయినా కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఇవన్నీ మామూలే. 2016లో సోమిరెడ్డి కుటుంబానికి విదేశాల్లో వెయ్యి కోట్ల ఆస్తులున్నాయంటూ నకిలీ పత్రాలు తయారు చేయించాడు. తీరా సోమిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కట్టుకున్న లుంగీతోనే పారిపోయి రెండు నెలలు కనిపించకుండా పోయాడు. చివరకు సుప్రీం కోర్టుకు పోయి కండీషన్ బెయిల్ తెచ్చుకుని 40 రోజుల పాటు రోజు కానిస్టేబుల్ వద్ద సంతకాలు పెట్టివచ్చాడు. అధికారాన్ని అడ్డుగా పెట్టుకుని గత ఐదేళ్ల అవినీతి, అక్రమాలతో చెలరేగిపోయాడు. బరితెగించి ప్రత్యర్థుల కుటుంబ సభ్యులను దూషించాడు. చనిపోయి తల్లిదండ్రులను కూడా వదిలిపెట్టలేదు ఆనాడే వైసీపీ అధినేత జగన్ రెడ్డి ఆయన తీరును ఖండించిఉంటే ఈ రోజు కాకాణి బతుకు ఇలా ఉండేది కాదు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్ని జిమ్మిక్కులు చేసినా చేసిన తప్పులకు శిక్ష అనుభవించకుండా తప్పించుకోలేడు.

## మా కాలనీలో రోడ్లు కాలువలు నిర్మించండి సార్
### - రూరల్ ఎమ్మెల్యేకి వినతిపత్రం



**నెల్లూరు రూరల్, ఏఫ్రిల్ 2, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని తల్పగిరి కాలనీలో రోడ్లు, కాలవలు నిర్మించాలంటూ స్థానిక ప్రజలు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వినతి పత్రం అందించారు. బుధవారం నెల్లూరు రూరల్ టిడిపి ఆఫీసులో ఎమ్మెల్యేను కలిసి స్థానిక సమస్యలను వివరించారు. వినతి పత్రం అందుకున్న రూరల్ ఎమ్మెల్యే కొట్టం రెడ్డి శ్రీధర్ రెడ్డి సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ని కలసిన వారిలో కాలనీ కి సంబందించిన దిలీఫ్ నర్సింగ్ స్కూల్ అధినేత ప్రభుదాస్, టీడీపీ నాయకులు జెన్ని రమణయ్య , పడకండ్ల రవికుమార్ , త్రివిక్రమ్ , వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివాస్‌ను నిర్వహించిన కమీషనర్



**కావలి, ఏప్రిల్02 ప్రభాతవార్త :** కావలి పురపాలక సంఘపరిధిలోని ప్రభుత్వ వైద్యశాల పరిసర ప్రాంతాలలో బుధవారం స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల వద్ద ఉన్నటువంటి ప్రధానరహదారి ప్రాంతాలు పరిశుభ్రం చేశారు. అంబేద్కర్ పార్కును శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు పరిసరాలు, పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. పరిశుభ్రత బాగుంటే రోగాలు దరిచేరవన్నారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు నడుంబిగించాలన్నారు. మున్సిపాలిటికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైద్యశాల అడ్వైజరి కమిటిసభ్యుడు చవల రామకృష్ణ, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, 28వ వార్డు టిడిపి బాధ్యులు నున్నా మురళి, ఎన్ఎంకె నాయుడు, శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మరొకసారి కన్వీనర్‌గా నియమితులైన సీఎం ఓబుల్‌రెడ్డి



**ఉదయగిరి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త :** వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా మరొకసారి పదవీ బాధ్యతలు చేపట్టారు సీఎం గానుగపెంట ఓబుల్‌రెడ్డి. ఉపాధ్యాయుడిగా పని చేస్తూ మండల విద్యాధికారిగా ఉద్యోగ విరమణ చేసిన ఓబుల్‌రెడ్డి మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ పార్టీలో క్రియాశీలక బాధ్యతలు పోషించారు. మండలంలోని ప్రజలందరిని కలుపుకుంటూ పోవడంలో ఆయనకు ఆయనే చాటిగా పేరు తెచ్చుకున్న ఓబుల్‌రెడ్డి పై సొంత పార్టీలోనే కొందరు కన్వీనర్‌ని మార్చాలంటూ అధిష్టానం దగ్గర ప్రతిపాదించడం అందరికి విధితమే. అయితే తదుపరి కన్వీనర్ ఎవరిని చేయాలి అన్న సందిగ్ధంలో పడిన అధిష్టానం సీఎం గానుగపెంట ఓబుల్‌రెడ్డి కంటే మెరుగైన వ్యక్తిని గుర్తించడం సాధ్యపడకపోవడంతో ఈ సారి కూడా కన్వీనర్‌గా ఓబుల్‌రెడ్డికే బాధ్యతలు అప్పగించడంపై మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక తరగతి గదిలో ఉన్న విద్యార్థులపై ఉపాధ్యాయుడికి ఎంత బాధ్యత ఉంటుందో అందరిని ఎలా సమానంగా చూస్తాడో అదే విధానంలో కార్యకర్తలను కూడా సొంత బిడ్డల్లా చూసుకోవడంలో మండలంలో ఎక్కడా పార్టీలో లోటు పాటు లేకుండా చేయడంలో సీఎంకి ఎవరు చాటి రారంటూ పలువురు అధిష్టాన నిర్ణయాన్ని అభినందిస్తున్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు మరోసారి అప్పగించిన ఇన్‌ఛార్జీ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, యువ నాయకులు మేకపాటి అభినవరెడ్డిలకు తాను రుణపడి ఉన్నానని పార్టీ బలోపేతం కోసం పార్టీ ప్రతిష్ఠ కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఈ సందర్భంగా సీఎం ఓబుల్‌రెడ్డి తెలియజేశారు.

## వెలుగు నిధులు స్వాహా చేసిన వారిని సస్పెండ్ చేయాలి

**రాపూరు,ఏప్రిల్2ప్రభాతవార్త :** రాపూరు మండలంలో వెలుగు పథకంలో నిధులు రూ.1కోటి 45 లక్షలకు పైగా స్వాహా చేసిన వారిని సస్పెండ్ చేయాలని ఎపి ప్రజా సంఘాల ఐక్య వేదిక సభ్యుడు గద్దల మునెయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాపూరు మండలంలోని 2019 జూన్ నుండి 2024 జూన్ వరకు జరిగిన ఆర్థిక లావాదేవిల నిధుల గోల్‌మాల్‌పై విచారన నిర్వహించాలని2024 నవంబర్ 11వ తేది జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చామన్నారు.దీనికి స్పందించిన కలెక్టర్ 9 మంది డిఆర్‌డిఎ సిబ్బందితో విచారణకు ఆదేశాలుఇచ్చారన్నారు.విచారణాధికారులు ఐదు నెలల పాటు మండల వ్యాప్తంగా యానాధి సమాఖ్య,మహిళా సమాఖ్యలో జరిగిన నిధుల స్వాహా రూ. ఒక కోటి 41 లక్షలు అని అవి ఏడుగురు సిబ్బంది ద్వారా అక్రమాలు జరిగినట్లు జిల్లా డిఆర్‌డిఎ పిడీకి నివేధిక ఇవ్వడం జరిగిందన్నారు. అయినా ఇప్పటి వరకు అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద,బడుగు బలహీన వర్గాలకు చెందవలసిన సోమ్మును స్వాహా చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో తాము చలో విజయవాడ నిర్వహించి,సెర్ప్ కార్యలయంలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

